## క్షణం క్షణం చావుకు భయపడితే చివరికేమయింది?

# యస్.వివేకానంద కథ

# డెత్

సుబ్బారావు చాలా సీరియస్ మనిషి! ముఖంలో నవ్వు మచ్చుకైనా కన్పించదు. నవ్వు మనిషికి మంచి టానిక్ లాంటిదనే వాదాన్ని బొత్తిగా ఒప్పుకోడు. కట్టుకున్న భార్య జోక్ చేసినా సహించదు.

ఎవరైనా సరే సుబ్బారావుతో మాట్లాడాలంటే హడలి చస్తారంతే! తన చుట్టూ వున్నవాళ్ళెవరైనా నవ్వుకోవటం సహించలేడు. అలాంటి సమయాల్లో ఇతని ముఖంలో కోపం జేవురిస్తుంది.

మూడు ఎం.ఏలు పాసైన సుబ్బారావు ఓ ప్రైవేట్ కంపెనీలో ఆఫీసరు. యూనిఫారంలో వున్న పోలీసు ఆఫీసరులాగ మనిషెప్పుడూ ధుమధుమలాడుతూండటం అతని నైజం.

నవ్వు నాలుగు విధాల చేటు అనే వాదాన్ని బలపరుస్తాడు. నవ్వు మనిషిని నవ్వులపాలు చేస్తుందనే అభిప్రాయం సుబ్బారావుది.

నవ్వు బ్రతుక్కి వరం లాంటిది — జీవితానికి నవ్వు టానిక్‌లా పనిచేస్తుందని... అని ఎవరైనా అతని ఎదుట అనటానికి వణికిపోతారు.

మూడైదుల సిగరెట్ కాల్చగల స్థోమత అతనికి వుంది. అందమైన భార్య, మారుతి కారు, చిన్నసైజు బంగళా సొసైటీలో స్టేటస్సు అతనికున్న ప్లస్ పాయింట్స్!

ఇన్ని ప్రత్యేకమైన లక్షణాలున్న సుబ్బారావులో ఓ తీరని కోరికుంది! అది అతనిలోవున్న చిరకాల వాంఛ.

సుబ్బారావు గొప్ప కళాకారుడు! చదువుకునే రోజుల నుంచే అనేక నాటకాలు



ప్రదర్శించి అటు ప్రైజులు, ఇటు మంచిపేరు సంపాదించాడు. ఎన్నో ప్రయోగాత్మకమైన నాటకాలు ప్రదర్శించి శెభాష్ అనిపించుకున్నాడు.

ఉద్యోగంలో స్థిరపడ్డాక నాటక రంగానికి దూరం కావలసి వచ్చింది. గత చరిత్ర గుర్తొచ్చినప్పుడల్లా ఏదో వెలితి అసంతృప్తి సుబ్బారావులో చోటు చేసుకుంటూ వుంటుం

ది.

ఓ రోజు దినపత్రికలో కొత్త హీరో కోసం ప్రకటన చూశాడు. నవోత్సాహం అతనిలో తొంగిచూచింది. శ్రీమతికైనా చెప్పకుండా ఫోటోలు దర్శక నిర్మాతకు పంపాడు.

అరిగిపోయిన చెప్పులతో, నలిగిన బట్టలతో వేషాల కోసం తిరగాల్సిన స్థితి లేదు తనకు.

చెప్పకూడదని తీర్మానించుకున్న సుబ్బారావు తన సినిమా ప్రయత్నం గురించి ఆమె కౌగిట్లో నలిగిపోతూ ఓ శుభసమయంలో చెప్పనే చెప్పాడు.

విషయం వినగానే రమ్య ముఖంలో రంగులు మారటం గమనించాడు.

"ఏమిటి రమ్యా అలా అయిపోయావ్? — నేను సినిమా హీరో కావటం నీకు ఇష్టం లేదా?"

"మీ వెండితెర జీవితం నన్ను చీకట్లోకి నెట్టేస్తుందేమోనని భయం. అంతే!" భర్త పెదాలను చుంబిస్తూ విన్పించీ విన్పించకుండా అంది.

"యూ సిల్లీ! నన్ను బుట్టలో వేసుకోవటం నీ వొక్కదానికే సాధ్యం — మరో స్త్రీ నా వంక చూస్తే మాడిమసైపోతుందంతే!" సీరియస్‌గానే జోక్ చేశాడు సుబ్బారావు.

* * *

కాలింగ్ బెల్ మోగింది. సుబ్బారావు తలుపు తియ్యగానే టెలిగ్రాం మెసెంజర్ ఎదురైనాడు.

టెలిగ్రాం అందుకుని, చదివి 'రమ్యా' అంటూ గావుకేక పెట్టాడు.

కాఫీ అందిస్తూ "టెలిగ్రాం ఎక్కడ్నించి..." అడిగింది రమ్య.

దిగాలుపడి "డాడీ పోయారట" గొణిగేడు.

"మనం వెంటనే బయల్దేరిపోవద్దూ..." కంగారు పడుతూ అంది రమ్య.

"నాకు భయంగా ఉంది. కాళ్ళూ, చేతులూ వణుకుతున్నాయ్ ... గుండె వేగంగా కొట్టుకుంటోంది..." సోఫాలో కుప్పకూలిపోయాడు.

"కన్నతండ్రి కదా... మనం వెళ్ళకపోతే ఎట్లా...?"

"నీకు తెల్సుగా రమ్యా! చావంటే నాకు చచ్చేటంత భయం అని — చచ్చిపోయిన వాళ్ళని చూడాలంటే నా గుండె ఆగిపోతుంది... ఇప్పుడెలా... ఏమిటి చెయ్యటం?..." సోఫాలోంచి లేచి కాలుగాలిన పిల్లిలా అటూ ఇటూ వేగంగా పచార్లు చేశాడు.

"ఫాను కింద ఓ పదినిముషాలు కదలకుండా కూర్చోండి. వేడివేడి కాఫీ తాగండి ముందు — మీలో వున్న భయం దానంతటదే పోతుంది..." రమ్య భర్తకి ధైర్యం నూరిపోసే ప్రయత్నం చేసింది.

"ఆ మధ్య మా కొలీగ్ చనిపోతే ఆఫీసులో అంతా వెళ్ళిచూశారు నేను తప్ప..." డీలాపడిపోతూ గొణిగేడు సుబ్బారావు.

"మీరు ఏదేదో వూహించుకుని మరింత కంగారుపడకండి! మరీ చిన్నపిల్లాడిలా ఏమిటి మీరు..."

"కాళ్ళూ చేతులు ఆడటంలేదు... తల తిరిగిపోతోంది. నాకు భయంగా ఉంది... నా

వళ్ళంతా చెమట పోస్తోంది రమ్యా...''

''చూడండీ... మీరు ధైర్యం తెచ్చుకోక తప్పదు. తండ్రి పోయాడని తెల్సి మనం వెళ్ళకపోతే బంధువులు మనల్ని ఆడిపోసుకోవటమే కాదు — వెళ్ళి అంత్యక్రియలు దగ్గరుండి జరిపించటం మీ విద్యుక్త ధర్మం...'' నచ్చచెప్పింది రమ్య.

బలవంతాన భర్తను బయల్దేరతీసింది. ఆ రాత్రికే ట్రయిన్లో బయల్దేరారిద్దరూ.

* * *

చావంటే ప్రతి మనిషికీ భయమే!

సుబ్బారావులో చావును గురించిన భయం ఎక్కువ పాళ్ళలో వుంది.

పుట్టిన ప్రతి వ్యక్తికీ చావంటే ఎందుకు భయం?—

అసలు చచ్చిపోవటం అంటే ఏమిటి — చనిపోయాక ఏమౌతుంది? పాపాలు చేసినవారు నరకానికి... పుణ్యంచేసిన వారు స్వర్గానికి పోవటం... ఇది నిజమా?... మళ్ళీ జన్మంటూ వుందా... వుంటుందా?? ... సైంటిఫిక్‌గా దీన్ని గురించి పరిశోధనలు జరిగాయా?...

ఏ రోగంతోనో మంచాన పడి చావటం..

నిద్రపోతూ మృత్యువాత పడటం... యాక్సిడెంట్‌కి గురై విలవిల్లాడిపోతూ దుర్భరమైన అవస్థ అనుభవించి కళ్ళు ముయ్యటం ... మరో విధంగా అంతిమశ్వాస వదలటం..

అసలు ఏమిటిదంతా?—

పిరికివాళ్ళు పదేపదే చస్తుంటారనటం..

ధైర్యవంతులకు చావనేదే వొక్కసారే వస్తుందనుకోవటం... ఏమిటిదంతా?

చావనేది పుట్టిన ప్రతివారికీ తథ్యం అని తెల్సు — అయిన చావు గురించి భయపడతారెందుకు?

ఈ ప్రశ్నలకు జవాబు దొరకటంలేదు సుబ్బారావుకి.

ప్రతి క్షణం చావు గురించే ఆలోచన!

''ఏమిటీ... ఏదో దీర్ఘంగా ఆలోచిస్తున్నారు...'' అడిగింది రమ్య.

''చావు గురించి...''

''ఛా! ఏమిటా మాటలు... ఈ విషయం గురించి మర్చిపోయి... మరో మంచి విషయం గురించి ఆలోచించకూడదూ...?'' లాలనగా అంది రమ్య.

''నేను చచ్చిపోతే...''



## ప్రేమ

''నువ్వు ఆ సుబ్బలక్ష్మినే ప్రేమించి పెళ్ళాడాలని ఎందుకనుకుంటున్నావు?'' అడిగాడు సుధాకర్ కిశోర్‌ని.

''ఆ ఏవుందీ? సుబ్బలక్ష్మి అయితే లక్షరూపాయల కట్నం వస్తుంది కదా'' సింపుల్‌గా చెప్పాడు కిశోర్.

—కె.ఎన్నార్ నమ్మి (పెనుగొండ)

రమ్య తన చేతిని భర్త నోటికి అడ్డుగా పెట్టింది.

''ఇలాంటి మాటలు మాట్లాడారంటే నన్ను చంపుకు తిన్నట్టే...''

''ఎవరి చావు ఎలా రాసి పెట్టి ఉందో ఎవరికి తెల్సు?...'' వేదాంతిలా మాట్లాడాడు సుబ్బారావు.

''ఏమిటండీ మరీను...'' గోముగా బుగ్గ గిల్లింది.

''సర్లే! పడుకో...''

''ఏం నిద్దరొస్తోందా...'' భర్త ఛాతీమీద వాలిపోతూ అంది రమ్య.

* * *

''రమ్యా! ఓ మారిలారా...'' కేకేశాడు సుబ్బారావు.

''కిచన్లో నాకు బోలెడంత పనుంది... మీ ఎదుట కూర్చుంటే ఆ పన్లెట్లా...'' వస్తూ అంది రమ్య.

''గుడ్ న్యూస్ — మరో అరగంటలో సినిమా ప్రొడ్యూసరూ డైరెక్టరూ మనింటి కొస్తున్నారు — నువ్వు వాళ్ళకు మంచి టిఫిన్ రెడీ చెయ్యాలి...''

''ఓస్ అదెంత పని... చిటికెలో చేసేస్తాను... అయితే శ్రీవారు సినిమా హీరో కాబోతున్నారన్నమాట...'' దగ్గరగా వచ్చి బుగ్గ గిల్లింది.

''డోన్ట్ బి సిల్లీ! పగటిపూట సరసం హెల్తుకి మంచిది కాదు...''

''అవునవును. హీరోగారు వలిగిపోకూడదు'' కసిక్కున నవ్వేసి ఇంట్లోకి తుర్రుమంది రమ్య.

ఇంటి ముందు కారాగింది!

దర్శక నిర్మాతలకి స్వాగతం పలికి ఇంట్లోకి ఆహ్వానించాదు సుబ్బారావు.

''స్క్రీన్ టెస్ట్ రిజల్టు తృప్తికరంగా ఉంది. మా పిక్చర్లో హీరోగా మిమ్మల్నే ఫిక్స్ చేశాం...'' పైప్ వెలిగిస్తూ ధీమాగా అన్నాడు డైరెక్టర్.

''రంగస్థలానుభవం వున్న మీ వంటి ఆర్టిస్ట్ దొరకటం మా అదృష్టం...'' ప్రొడ్యూసర్ శృతి కలిపాడు.

వాళ్ళ మాటలు విన్న సుబ్బారావు కృతజ్ఞతగా ఓ చిరునవ్వు అందించాడు.

ఇంతలో టిఫిన్ వచ్చింది. పిచ్చాపాటీ మాట్లాడుకుంటూ ముగ్గురూ టిఫిన్ చేసే కార్యక్రమం ముగించారు.

''ఇక మీరు అగ్రిమెంట్ ఫారం మీద సంతకం చేస్తే...'' కాగితాలు బేగ్‌లోంచి తీసి సుబ్బారావుకి అందించాడు నిర్మాత.

చదివి సంతకం చేశాడు సుబ్బారావు.

''బైదిబై... తియ్యబోతున్న సినిమా కథ మీకు విన్పించలేదు కదూ...'' పీల్చిన పొగ గుప్‌గుప్‌న వదుల్తూ మాట్లాడాదు డైరెక్టర్.

''ఓ ఆర్టిస్ట్ యదార్థ జీవితమే మన సినిమా కథ! — అష్టకష్టాలు అనుభవించిన ఓ నటుదు అనుకోకుండా సినిమా యాక్టరై కొద్దికాలంలోనే పేరుతోబాటు డబ్బూ సంపాదిస్తాడు. విలాస జీవితానికి అలవాటుపడి.. . కాలక్రమేణా సర్వం కోల్పోతాడు — అనారోగ్యవంతుడౌతాడు. చివరికి అనాథగా ఓ రోడ్డు మీద అంతిమశ్వాస వదుల్తాడు...''

యూకీగా కథ చెప్పాడు డైరెక్టర్.

"సూపర్బ్! కథ చాలా బావుంది" అన్నాడు సుబ్బారావు.

"ఇలాంటి ప్రయోగాత్మకమైన కథ సినిమాగా ముందెన్నడూ రాలేదు — ఇదొక నటుడికి సంబంధించిన సబ్జెక్టు కావటంతో మిమ్మల్నే ఎన్నుకున్నాం..." ఠీవిగా చెప్పాడు డైరెక్టర్.

"ఇదిగోనండీ ఎడ్వాన్సు..." కొత్త కరెన్సీ నోట్లకట్ట సుబ్బారావుకి అందించాడు నిర్మాత.

"పిక్చర్లో కథంతా ఫ్లాష్‌బాక్‌లో నడుస్తుంది..." డైరెక్టర్ అన్నాడు.

"అంటే..." సుబ్బారావు ఆత్రంగా అడిగాడు.

"పిక్చర్ ఓపెనింగు, హీరో చచ్చిపోయాక శవాన్ని ఊరేగించటం... శవాన్ని తగలబెట్టడంతో మొదలై అసలు కథ తర్వాత నడుస్తుంది..."

ఆ మాట విన్న సుబ్బారావు గుండె వేగంగా కొట్టుకోనారంభించింది. అప్పటివరకు అతనిలోవున్న ఉత్సాహం నీరుకారిపోయింది.

"డెత్ సీనుతో నా వేషం ప్రారంభమౌతుందన్నమాట" నీరసపడిపోతూ అన్నాడు.

"డోన్ట్‌వర్రీ సుబ్బారావుగారూ — పిక్చర్ ఓపెనింగ్ అద్భుతంగా చిత్రీకరిస్తాం..." డైరెక్టర్ అన్నాడు.

"మరి... మా నుంచి టెలిగ్రాం అందుకున్న వెంటనే బయల్దేరి రావాలి మీరు!"

నిర్మాత మాట విన్న సుబ్బారావులో చలనం కన్పించలేదు. మనిషి మొద్దుబారిపోయాడు.

"మరి... మేం వెళ్ళొస్తాం..." ఇద్దరూ లేచి నిలబడి సెలవు తీసుకుని బైటికి వెళ్ళిపోయారు.

అప్పుడే రమ్య అక్కడికొచ్చింది.

"శ్రీవారికి కంగ్రాట్యులేషన్స్..."

సుబ్బారావు బిగుసుకుపోవటం చూసి రమ్య "ఏమిటలా వున్నారు?" చేత్తో కుదుపుతూ అడిగింది.

"శుభమాని మొట్టమొదటిసారిగా నటించబోయే సినిమాలో కూడా చావుతోటే మొదలౌతుంది నా వేషం! అందుకే దిగులుగా వుంది..."

"డోన్ట్ బి సిల్లీ మై డియర్ శ్రీవారూ..




## గ్రీటింగ్స్ పిచ్చి

ప్రతి సంవత్సరం గ్రీటింగ్ కార్డ్ పంపటం ఈరోజుల్లో చాలా కాస్ట్లీ ఎఫైర్! అయితే ఇప్పటికీ అమెరికాలోని శాన్‌ఫ్రాన్సిస్కోకు చెందిన పెర్సల్ ఎరిహార్ట్ అనే వ్యక్తి అతి ఎక్కువగా షుమారు 62 వేల కార్డుల్ని ప్రతి సంవత్సరం క్రిస్మస్ సందర్భంగా పంపుతూ ఉంటాడు. ఎవరి పిచ్చి వారికానందం... అంటే ఇదే!

—జూపిటర్

"...ప్రతి చిన్న విషయాన్ని గురించీ సీరియస్‌గా ఆలోచించి బుర్రపాడు చేసుకోవటం మీకు అలవాటైంది..." పక్కగా కూర్చుని భర్త చేతిని తన చేతిలోకి తీసుకుని నిమిరింది

* * *

"బాబోయ్ హీరోగారూ... కాస్తంత హుషారు పెంచుకోవాలి... డల్‌గా వుంటే ఎల్లా?" భోజనం వడ్డిస్తూ అంది రమ్య.

"చావుసీను నాలో విషాదగీతాన్ని పాడుతోంది..."

"చూడండీ! — సినిమాల్లో చావులు, పెళ్ళిళ్ళు, విరహగీతాలు... ముష్టియుద్ధాలు... డ్యూయట్లూ మామూలే — కాబట్టి డోన్ట్‌వర్రీ... ఆనందంగా వుండండి..." భర్త కళ్ళల్లోకి చిలిపిగా చూస్తూ అంది.

"బతికి వుండగానే నన్ను పాడెమీద పడుకోబెడతారు — వాహకులు మోస్తారు... తర్వాత తగలేస్తారు! నో! వద్దు — ఇలాంటి దృశ్యంలో సినిమా పరిశ్రమకు పరిచయం కావటం నాకు ఇష్టం లేదు..." చెయ్యి వణుకుతూంటూ అయిష్టంగా మాట్లాడేడు.

"మీరు ఇలా ఆలోచిస్తూ భయపడితే హీరోగా ఎలా నిలబడగలరు...?" ఛలోక్తిగా అంది.

"ఏమిటో... ఇలాంటి సెంటిమెంట్ నాకు నచ్చటంలేదు రమ్యా..." వక్కపొడి నములుతూ అన్నాడు.

"సరేసరే... ఆఫీసుకి వేళవుతోంది... బయల్దేరండి..." మాట మార్చే ధోరణిలో అంది రమ్య.

చేతిలో బ్రీఫ్‌కేస్‌తో కారెక్కాడు సుబ్బారావు.

* * *

టెలిగ్రాం రానే వచ్చింది.

ధైర్యాన్ని కూడదీసుకున్న సుబ్బారావు ప్రయాణమైనాడు. చిరునవ్వుతో భర్తను సాగనంపింది రమ్య!

తెల్లారి ఏడుగంటలకు రాజమండ్రిలో రైలు ఆగింది.

బోగీలోంచి దిగుతున్న సుబ్బారావుకి ప్రొడక్షన్ మేనేజర్ స్వాగతం పలికి కార్లో గెస్ట్‌హౌస్‌కి తీసుకెళ్ళాడు.

స్నానం కార్యక్రమం పూర్తి అయ్యేసరికి డైరెక్టర్ వచ్చాడు.

"హీరోగారూ! మీరు టిఫిన్ పూర్తి చేసుకుని మేకప్ చేయించుకోవటానికి రడీ అవండి! — మరో అరగంటలో మనం అవుట్‌డోర్ షూటింగ్‌కి బయల్దేరుతున్నాం" విషయం చెప్పి వెళ్ళిపోయాడు డైరెక్టర్.

సుబ్బారావులో కొండంత ఆనందంతో పాటు గోరంతదిగులు చోటుచేసుకున్నాయ్.

మేకప్ పూర్తి అయింది. చెరిగిన విగ్గు... చిరిగిన లాల్చీపైజామా... కొద్దిగా పెరిగిన గడ్డం... అద్దంలో ముఖం చూసుకున్న సుబ్బారావు బావురుమన్నాడు. మళ్ళీ అంతలోనే సంభాళించుకున్నాడు.

ప్రొడక్షన్ మేనేజర్ అసోసియేట్ డైరెక్టర్‌తోపాటు కారెక్కాడు సుబ్బారావు.

కారు లొకేషన్ చేరుకుంది!

అవుట్‌డోర్ షూటింగ్ కావటాన అప్పటికే జనం చాలామంది అక్కడ గుమిగూడి వుండటం చూశాడు సుబ్బారావు. అక్కడి వాళ్ళను కంట్రోల్ చెయ్యటానికి కొందరు పోలీసువాళ్ళూ అవుపించారు.

సుబ్బారావు కారు దిగేడు. హుందాగా ముందుకు రెండు అడుగులు వెయ్యగానే డైరెక్టరే ఎదురై వెంటపెట్టుకుని స్పాట్‌కి తీసుకెళ్ళాడు.

''చూడండీ!... రోడ్డు చివరగా వున్న ఈ చెట్టు కింద మీరు చనిపోయినట్టు పడుకుని వుండాలి! — ఇది మొదటి సన్నివేశం! — తర్వాత షాట్‌లో మీరు పాడె మీద పడుకుని వుంటారు — ఆ తర్వాత వూరేగింపు సీను చిత్రీకరిస్తాం!! — చచ్చిపోయిన సీను గనుక మీరు చలనం లేకుండా పడి వుండాలి! అండర్‌స్టాండ్!... ఏ మాత్రం కదిలినా క్లోజ్ షాట్సు... జూమ్ షాట్సు వుంటాయి గనక... కన్పిస్తుంది — బీ! కేర్‌ఫుల్...'' క్లుప్తంగా వివరించిన దర్శకుడు భుజం తట్టి ధైర్యం చెప్పాడు సుబ్బారావుకి.

తాను బ్రతికివున్నాడు — కానీ... ఇప్పుడు మూడ్‌లోకి వెళ్ళి చచ్చిపోయినట్టు నటించాలి! అందులోనూ సహజంగా వుండాలి సీను... నవ్వొచ్చింది సుబ్బారావుకి జీవితంలో మొదటిసారిగా.

షూటింగ్ చూడటానికొచ్చిన జనాన్ని అదుపు చేస్తూ పోలీసులు శ్రమపడుతున్నారు.

డైరెక్టర్ కెమెరా దగ్గరుండి లెన్సులోంచి చూస్తున్నాడు.

''హీరోగారూ... మీరు పడుకుని ఓ మారు పొజిషన్ చూపించండి...'' దూరం నుండి కేకేసి చెప్పాడు డైరెక్టర్.

సుబ్బారావు చలనం లేకుండా రోడ్డు పక్కగా పడుకున్నాడు.

గబగబా డైరెక్టర్ దగ్గరకొచ్చి ఎలా పడివుండాలో సుబ్బారావుకి వివరించాడు.

ఓ పావుగంటలో మొదటి షాట్ ఓకే



అయింది.

తర్వాత సన్నివేశం కోసం కెమెరా అరేంజ్ చేస్తున్నారు.

డైరెక్టర్ మళ్ళీ వచ్చి సుబ్బారావుని అప్పటికే రెడీ చేసి వుంచిన పాడెమీద పడుకోమన్నాడు.

సుబ్బారావు గుండె ఝల్లుమంది! కంట్లో నీరు సుళ్ళు తిరిగింది.

నిశ్చలంగా పాడె ఎక్కి పడుకున్న సుబ్బారావు నిండా పూలమాలలు... చుట్టు చూశాడు... పక్కగా పాడెను మొయ్యటానికి నలుగురు మనుషులు అవుపించారు. వాళ్ళను చూడగానే సుబ్బారావులో భయం చోటు చేసుకుంది. సుబ్బారావు కళ్ళకి ఆ నలుగురూ యమకింకరులమల్లే అవుపించారు.

తానిప్పుడు చచ్చిపోయినట్టు నటించాలి! ఎంత చిత్రంగా వుందీ అనుభూతి! — బ్రతికి వుండగానే తాను ఇలాంటి సన్నివేశాన్ని అనుభవించటం ఎంత విచిత్రం!

''షాట్ రెడీ...'' డైరెక్టర్ కేక విన్పించింది.

సుబ్బారావు మూడ్‌లోకి వెళ్ళిపోయాడు కళ్ళు మూసుకున్నాడు — వూపిరి బిగబట్టాడు.

పాడె పైకి లేచింది శవ వాహకులు ముందుకు నడిచారు.

రెండో షాట్ కూడా శ్రమలేకుండానే ఓకే అయినందుకు డైరెక్టర్ ముఖంలో సంతోషం వెల్లివిరిసింది.

వాహకులు పాడె దించారు.

''హీరోగారూ... ఇక మీరు లేవచ్చు...'' దూరం నుంచి దర్శకుడి కేక.

పాడె మీదున్న సుబ్బారావులో చలనం కన్పించలేదు.

దగ్గరగా వచ్చి ''ఏమిటీ నిద్రపోతున్నారా హీరోగారూ! షాట్ చాలా నాచురల్‌గా వచ్చింది లేవండి... లేవండి'' మరోసారి అన్నాడు దర్శకుడు.

సుబ్బారావు ఇంకా పాడె మీదే వున్నాడు.

దర్శకుడు వంగి సుబ్బారావుని చేత్తో కుదిపాడు. నిద్ర లెమ్మన్నాడు.

శాశ్వత నిద్రలోకి ఎప్పుడో ఒరిగిపోయిన సుబ్బారావుకి ఇదేం తెలీదు.

నాడిపట్టుకు చూచిన దర్శకుడు... పక్కనే వున్న యూనిట్ అంతా ఘొల్లుమన్నారు.

*

